జిల్లా జైలును సందర్శించిన ప్రధానన్యాయమూర్తి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21: కరీంనగర్ జిల్లా జైలును శనివారం జిల్లా ప్రధానన్యాయమూర్తి బి ప్రతిమ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్, కరీంనగర్ రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం హేమలత సందర్శించారు. జైలులో జైలు అదాలత్‌ను నిర్వహించి, ఇద్దరు ఖైదీల కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్ పి శ్రీనివాస్, జైలర్ బి రమేష్, వైద్యాధికారి కె వేణుగోపాల్, డిప్యూటీ జైలర్లు ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్ రమేష్‌నాయక్, ఎస్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

విబేధాలు లేవు...

కలిసి పనిచేస్తాం

- కాంగ్రెస్ సమావేశంలో మంత్రుల ఐక్యతారాగం
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం
- నియోజకవర్గ స్థాయిలో నేతల పర్యటనలు
- పార్టీ నేతలకు సముచిత ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్ శనివారం గాంధీభవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు తమ మధ్య విబేధాలు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారం ఉట్టిదేనని, పార్టీ పటిష్టత, స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం కలిసి పనిచేస్తామంటూ ప్రకటించి పార్టీ నేతల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారని సమాచారం. ఎమ్మెల్యేలు మినహా మిగతా నేతలకు ప్రాధాన్యత లేకుండా పోతున్నదని, కొన్ని జిల్లాల్లో అధికారులు అసలు తమను పట్టించుకోవడమే లేదని పార్టీ నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. రాజన్న



సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికీ అధికారులు బీఆర్ఎస్ నేతల మాటలే వింటూ పనిచేస్తున్నారని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదని సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారని తెలిసింది. సమావేశంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీతో పాటు ప్రారంభోపన్యాసం చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ నేతలందరూ కలిసి పనిచేయాలని, చిన్నచిన్న విబేధాలు ఉంటే కుటుంబం మాదిరిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని చేసిన సూచనకు ఆ తర్వాత మాట్లాడిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ తమ మధ్య విబేధాలు లేవని, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రధానంగా కరీంనగర్ కార్పొరేషన్, రామగుండం కార్పొరేషన్లను సాధించుకోవడానికి కృషిచేస్తామని అన్నారని సమాచారం. మంత్రి శ్రీధర్‌బాబు ఉమ్మడి జిల్లా పరిధిలో తాము ఐక్యంగానే ఉన్నామని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత పటిష్టవంతంగా తీర్చి దిద్దేందుకు కలిసి పనిచేస్తామని మాట్లాడగా మరో మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అభివృద్ధి, పార్టీ పటిష్టత గురించి తప్ప తాను వ్యక్తిగత లక్ష్యాలతో పనిచేయనని స్పందించారు. ఈ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా కలిసి పనిచేయాలని, పార్టీ నాయకత్వం ప్రతినిధులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యల గురించి పార్టీకి సూచనలు అందించాలని కోరారని తెలిసింది. ప్రస్తుతం మంత్రులు గాంధీభవన్‌కు వస్తున్నారని, నెలకొక సారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా గాంధీభవన్‌లోకి వస్తారని, జిల్లాలవారీగా నేతలతో సమావేశమై సీఎం వారి సమస్యలను వింటారని హామీ ఇచ్చారు. పార్టీ పటిష్టంగా ఉంటేనే ప్రభుత్వం కూడా నిలదొక్కుకుం టుందని అందుకే పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పెద్దపీట వేస్తామని మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. పార్టీ నేతలు గాంధీభవన్‌కు వచ్చి వారి సమస్యలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్న నేతల దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో తనతో సహా ఏఐసీసీ, పీసీసీ ముఖ్యనేతలు నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల క్షేత్రస్థాయిలో ప్రజల స్పందనలు తెలుసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టేందుకు సూచనలిస్తారని అన్నారు. పార్టీ నేతలందరూ స్థానిక సంస్థలను కైవసం చేసుకునే లక్ష్యంగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది. త్వరలోనే డీసీసీ అధ్య క్షులను నియమించి కొత్త కమిటీలను కూడా ఏర్పాటు చేస్తామని, కొత్త నాయకత్వం ఉత్సాహంగా పనిచేసి పార్టీని తీర్చి దిద్దాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథన్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్య నారాయణ, మేడిపల్లి సత్యం, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విజయర మణా రావు, ఆది శ్రీనివాస్, రాజ్‌ఠాకూర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కటకం మృత్యుంజయం, ప్రవీణ్‌రెడ్డి, సీనియర్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రోహిత్‌రావు, కేకే మహేందర్‌రెడ్డి, ఒడితెల ప్రణవ్, పురమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వానితుల జాబితాలో కనిపించని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు

కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో గందరగోళం ఏర్పడింది. ఆహ్వానితుల జాబితాలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు లేకపోవడంతో ఆయన ఆగ్రహించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పేరుతో పాటు మిగతా ఎమ్మెల్సీల పేర్లు పెట్టి తన పేరు పెట్టకపోవడంతో మనస్తాపం చెందిన జీవన్‌రెడ్డి పార్టీ నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ తప్పు జరిగిందని ఒప్పుకోవడంతో జీవన్‌రెడ్డి శాంతించారు.

మరో 7 గ్రామాలు



- కార్పొరేషన్‌లోకి కొత్తపల్లి మున్సిపాలిటీ
- మారనున్న కరీంనగర్ ముఖచిత్రం
- ప్రతిపాదనలు పంపాలని మంత్రి 'పొన్నం' ఆదేశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు మరో ఆరు గ్రామాలను కరీంనగర్ నగరపాలక సంస్థలో కలిపేం దుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. త్వరలోనే జిల్లా నుంచి ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరుతాయని భావిస్తున్నారు. కరీంనగర్‌కు పది కిలో మీటర్ల పరిధిలో ఉన్న బొమ్మకల్, దుర్శేడ్, గోపాల్‌పూర్, చింతకుంట, లక్ష్మీపూర్, మల్కాపూర్ గ్రామాలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని కోరుతూ ప్రతిపాదనలను పంపాలని మంత్రి కోరారు. శరవేగంగా నగరం నలుదిశలా విస్తరిస్తున్న కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోకి సమీపంలోని ఈ గ్రామాలను విలీనం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, పట్టణీకరణ వేగవం తంగా జరుగుతున్న నేపథ్యంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి తదితర కనీస సౌకర్యాలను ప్రజలకు సమకూర్చాల్సిన అవసరమున్నందున ఈ గ్రామాలను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి పొన్నం కలెక్టర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

- 2019లో జరిగిన ఎన్నికల సమయంలో విలీనం చేసిన గ్రామాల్లో ఆశించిన అభివృద్ధి జరుగలే దని, కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆరోపిస్తున్నారు. అలాగే ఇంటి నిర్మాణ అనుమతుల, ఆస్తిపన్నులను విపరీతంగా పెంచారే తప్ప మాకు కల్పించిందేమీ లేదని, గ్రామపంచాయతీ ఉంటేనే బాగుండేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా మరో ఏడు గ్రామాలను విలీనం చేయడంపై కూడా ఆయా గ్రామాల ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పంచాయ తీలను కార్పొరేషన్‌లో కలుపడంతో పన్నుల భారం తప్ప పెద్దగా ఒరిగే దేమీ ఉండదని పంచాయతీలుగానే కొనసా గించాలని కొందరు, కార్పొరేషన్‌లో విలీనం చేస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుందని మరికొందరు చెబుతున్నారు.

కార్పొరేషన్‌లో కొత్త గ్రామా లను విలీనం చేస్తే నగర ముఖచిత్రం కూడా పూర్తిగా మారుతుందని, డివిజన్ల సంఖ్య కూడా పెరుగుతుందని, రిజర్వేషన్లు కూడా మారుతాయని, దీనితో తలరాతలు మారిపోతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- నాలుగున్నర నెలల్లో కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గ్రామాలను విలీనం చేయడంతో ఎన్నికలు కూడా ఆలస్యమవుతాయని రాజకీయవర్గాల్లో కూడా భిన్నమైన అభిప్రా యాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కొత్తపల్లి మున్సిపాలిటీలో ఇప్పటికీ ఆశించిన అభివృద్ధి జరుగలేదని, కార్పొరేషన్‌లో విలీనం ఎందుకని అక్కడి ప్రజలు కూడా వ్యతిరేకిస్తు న్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ప్రతిపాదనల మేరకు కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు ఆరు గ్రామాల విలీనంపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

"కరీంనగర్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం 60 డివిజన్లు ఉన్నాయి. గత కార్పొరేషన్ ఎన్నికలకు ముందు పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లం పహాడ్, సదాశివపల్లి, అల్గునూర్ గ్రామాలను కార్పొరేషన్ లో విలీనం చేశారు. అదే సమయంలో కొత్తపల్లి గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. అయితే ప్రస్తుతం ఈ మున్సిపాలిటీని కూడా కరీంనగర్‌లోనే కలుపాలనే ప్రతిపాదన చేయను న్నారు. 2025 జనవరి 29తో నగరపాలక సంస్థ పాలకవర్గ పదవీకాలం ముగియ నున్నది. ఈ నేపథ్యంలో కరీంనగర్‌కు అతి చేరువలో ఉన్న బొమ్మకల్ చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను కార్పొ రేషన్‌లో విలీనం చేసి అభివృద్ధి చేయాలంటూ ఆయా గ్రా మాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. దీనితో మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్తగా మరో ఏడు గ్రామాలను విలీనం చేయాలని కోరుతూ ప్రతిపాదనలను పంపించాలని కలెక్టర్‌ను కోరడం రాజకీయవర్గాల్లో కొత్త చర్చకు తెరలేసింది."



అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 21: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని శుభం గార్డెన్స్‌లో అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో రెవా రాప్సోడీ-24 పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించేందుకు కఠోరశ్రమతో గమ్యం వైపు సాగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రు లకు, కళాశాలకు పేరు తీసుకు రావాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రియాశీలక విద్యా నైపుణ్యాభివృద్ధికి కళాశాలలో ఏర్పాటు చేసిన క్లబ్‌లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. అల్ఫోర్స్ లియో క్లబ్ అడ్వైజర్ కెప్టెన్ లయన్ డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యను ఛాలెంజింగ్ తీసుకుని అధిగమించేందుకు పోరాటం చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటి అనుమతుల్లో అక్రమాలపై డీఎల్‌పీవో విచారణ

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్21: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో ఇంటి నిర్మాణ అనుమతుల్లో అక్రమాలపై శనివారం డీఎల్‌పీఓ శ్రీనివాస్ విచారణ చేపట్టారు. రజ్వీచమన్‌లో పంచాయతీ అధికారులు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని ఇటీవల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. దీనిపై మండల పరిషత్ అధికారులను కలెక్టర్ పిలిచి విచారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ ఇంటి అనుమతుల వ్యవహారంపై గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. ఇంటి అనుమతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పంచాయతీ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచిం చారు. అదే విధంగా పలు గ్రామాల్లోని ఓటరు జాబితాల్లోని తప్పులను సవరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాలోని తప్పులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజలాలను సరఫరా చేయాలి

- రేపటి నుంచి మళ్లీ రోజూ నీటి సరఫరా
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 21: వర్షాలతో కొత్తనీరు వచ్చి చేరినందున క్లోరినేషన్ ప్రక్రియ, ఆలం మిక్సింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించి శుద్ధజలాలను ప్రతి రోజూ నగర ప్రజలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన ఎల్ఎండీ సమీపంలోని ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి, నీటి శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. లోలెవల్ పరిధిలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ఆయన ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి పలు సూచనలు చేశారు. నగరంలోని లోలెవల్, హైలెవల్ పరిధిలో ఎక్కడ కూడా నీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. 84 మిలియన్ లీటర్ల నీటిని శుద్ధి చేసే ఫిల్టర్ బెడ్స్‌లో మోటారు పంపులను, ల్యాబ్‌ను తనిఖీ చేశారు. నీటి సరఫరాకు తలెత్తిన సమస్యను పరిశీలించి 350 హెచ్‌పి మోటారు పంపు వాల్ చెడిపోయినందున యుద్ధ ప్రాతిపదికన వాటిని తెప్పించి మరమ్మతు చేయించారు. ఫిల్టర్ బెడ్స్‌లో మరమ్మతు పనులను చూసి మేయర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం నుంచి గతంలో మాదిరిగా శుద్ధిచేసిన తాగు నీటిని ప్రతిరోజు నగర ప్రజలకు అందిస్తామని మేయర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్, నేతికుంట యాదయ్య, డీఈ లచ్చిరెడ్డి, ఫిల్టర్‌బెడ్ ఇంచార్జి అజయ్ పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్ వద్ద తనిఖీ చేస్తున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

నిధులున్నా... నిష్ప్రయోజనమే



- బ్యాంకులో రూ.18 కోట్ల 'బల్దియా' నిధులు
- 15వ ఆర్థిక సంఘం నిధులకు నిబంధనలు అడ్డంకి
- వినియోగానికి అవకాశమివ్వాలంటూ ప్రభుత్వానికి మేయర్ లేఖ

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 21: ఓవైపు నిధులు కొరత... మరోవైపు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల పెండింగ్, ఇంకోవైపు అసంపూర్తి పనులు, విద్యుత్ చార్జీలు కూడా చెల్లించని ఆర్థిక పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్న కరీంనగర్ నగరపాలక సంస్థలో దాదాపు రెండున్నరేళ్లుగా 18 కోట్ల రూపాయలున్నా వాటిని వినియోగించలేని పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నుంచి నగరపాలక సంస్థకు 36 కోట్ల రూపాయలను విడుదల చేశారు. ఈ నిధుల్లో 50శాతం తాగునీటి కోసం వెచ్చించాలనే నిబంధన చేర్చడంతో 18 కోట్ల నిధులు వినియోగించుకోలేని స్థితి ఏర్పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ 50శాతం విధిగా తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలని, మిగిలిన 50శాతం నిధులతో ఇతర అవసరాలకు వినియోగించు కోవాలని పేర్కొంది. దీనితో 50శాతం నిధులతోనే అభివృద్ధి పనులను చేపట్టారు. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ పథకం నిధులను కూడా విడుదల చేసింది. ఈ నిధులను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలనే నిబంధన లున్నవి. దీనితో అమృత్ నిధులతో కార్పొరేషన్‌లో విలీన గ్రామాలైన డివిజన్లలో తాగునీటి పైపులైన్లు వేయడం, నల్లా కనెక్షన్లు ఇవ్వడం వంటి పనులు చేపట్టారు. ప్రస్తుతం నగరంలోని 60 డివిజన్లలో తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు చేపట్టింది. దీనితో 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేయలేని పరిస్థితిలో బ్యాంకులో డిపాజిట్ చేసి ఉంచారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణ ప్రగతి, సీఎం హామీ నిధుల కింద వందల కోట్ల రూపాయలను నగరపాలక సంస్థకు మంజూరు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ రెండు పథకాల ద్వారా కానీ, మరే ఇతర పథకం ద్వారా కానీ ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. అంతేకాకుండా అప్పటికే ఆయా పథకాల కింద పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వలేదు. దీనితో కాంట్రాక్టర్లు పనులను పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలి పెట్టారు. కొన్ని చోట్ల ఇంకా పనులు కూడా ప్రారంభం కాలేదు. దీనితో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలతో ఆర్థిక సంఘం నిధులను ఇతర అవసరాలకు వినియోగించుకోలేక బ్యాంకుల్లోనే ఉన్నాయని, వాటిని ఇతర అభివృద్ధి పనులకు వినియోగించుకునే అవకాశం ఇవ్వాలని కోరుతూ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వానికి లేఖ రాశారు. అదనంగా 200 కోట్లను విడుదల చేసి నగర అభివృద్ధికి సహకరించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

ఎమ్‌స్వాస్థ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు

- రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా గంభీరావుపేటలో ఏర్పాటు

గంభీరావుపేట, సెప్టెంబరు 21: గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ వైద్య సలహాల్లో భాగంగా ఎమ్ స్వాస్థ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వైద్య సేవలను అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో మొదటగా గంభీరావుపేటలో నాబార్డు, సింగిల్ విండోల సహకారంతో ఏర్పాటు చేసినట్లు నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ప్రారంభించారు. గంభీరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవరణలో నాబార్డు ద్వారా ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ శనివారం ఎమ్ స్వాస్థ్ సౌత్ ఇండియా మార్కెటింగ్ రీజినల్ హెడ్ శరత్ చంద్రతో కలిసి నాబార్డు రీసోర్స్ పర్సన్ షరీఫ్, నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావులు ప్రారంభిం చారు. ఒక్కో కుటుంబం నుంచి 365 రూపాయలు చెల్లిస్తే ఏడాది పాటు ఉచితంగా వైద్య సేలు అందిస్తామని అన్నారు. 400 మంది వైద్యులు అన్‌లైన్‌లో సలహాలు, సూచనలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

మానకొండూర్, సెప్టెంబరు 21: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజర వ్వాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించడమే కాకుండా భాషలో నైపుణ్యం సాధించాలని చెప్పారు. దీర్ఘకాలంగా పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం మధుసూదనాచారి, జిల్లా సమన్వయకర్త ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

గన్నేరువరం, సెప్టెంబరు 21: మండలంలోని చీమలకుంటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ పాషాను కలెక్టర్ శనివారం సస్పెండ్ చేశారు. పాషా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో సరైన ధ్రువపత్రాలు లేనప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చాడని, మ్యుటేషన్‌లు చేశాడని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా అక్రమాలు జరిగినట్లు గుర్తించడంతో కలెక్టర్ సస్పెండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంగాధర, సెప్టెంబరు 21: గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామశివారు పరిధిలో వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఉప్పరమల్యాల శివారులో గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బావిలో మృతి చెంది ఉన్నాడని సమాచారం రావడంతో పరిశీలించామని చెప్పారు. మృతుడు నీలిరంగు ప్యాంటు, టీ షర్టు ధరించి ఉన్నాడని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోటి రూపాయలతో ఇద్దరు పరారీ..?

హుజూరాబాద్, సెప్టెంబరు 21: హుజూరాబాద్ ప్రాంతంలో అప్పులు చేసిన ఇద్దరు వ్యక్తులు కోటి రూపాయలు చెల్లించకుండా పరారవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఓ హోటల్ నిర్వాహకుడు 15రోజుల క్రితం రూ. 50లక్షలతో పరారీ కాగా, రెండు రోజుల క్రితం రంగాపూర్ గ్రామానికి చెందిన డేకరేషన్లు చేసే వ్యక్తి రూ. 50లక్షల రూపాయలు అప్పులు చెల్లించకుండా ఉడాయించాడు. వీరు ఇద్దరు ఏళ్లగా నమ్మకంగా వ్యాపారం చేసుకుంటుండడంతో కొంత మంది తమ వద్ద ఉన్న డబ్బులను వడ్డీ ఆశతో అప్పుగా ఇచ్చారు. వీరిద్దరూ పరారీ కావడంతో వారి ఆచూకీ కోసం బాధితులు గాలిస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ బేకరి దుకాణం యజమానితో పాటు సూపర్‌బజార్ రోడ్‌లో చిట్టీలు నడి పే వ్యక్తి కూడా రూ. 1.50కోట్ల రూపాయలు అప్పులు చెల్లించకుండా పరారయ్యాడు. వరసగా నలుగురు పరారీ కావడం పట్టణంలో చర్చనీ యాంశమైంది.

మహిళ బంగారు నగలు చోరీ

చొప్పదండి, సెప్టెంబరు 21: మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన మహిళ ఆరు తులాల బంగారు నగలను దుండగులు చోరీ చేశారు. ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి రాధ ఆరు తులాల బంగారం చొప్పదండిలోని యూనియన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టడానికి శనివారం వచ్చింది. బ్యాంక్‌లో బంగారం కవర్ పెట్టి జిరాక్స కోసం బయటకు వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బంగారు నగలు ఉంచిన కవర్ కనిపించలేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బందనకల్ శివారులో పేకాటరాయుళ్ల అరెస్టు

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని బందనకల్ శివారులో పేకాట రాయుళ్ల స్థావరం దాడి చేసినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శనివారం తెలిపారు. సమాచారం మేరకు బందనకల్ శివారులో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నా రు. మరో ఆరుగురు పరారు అయ్యారని తెలిసింది.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,502 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 8,502 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


బి పల్లవి | మణిచరణ్ | శశాంక్

చొప్పదండి, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవోదయ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బి పల్లవి, శశాంక్, మణిచరణ్ జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, పీఈటీ రాధికను ప్రిన్సిపాల్ మంగతయారు శనివారం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు నవోదయ విద్యాలయ జట్టు తరుపున జాతీయ స్థాయి హ్యాండ్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మంగతయారు తెలిపారు.

భవితకు నవోదయం

- పీఎంశ్రీ స్కూల్స్‌గా జవహర్ నవోదయ విద్యాలయాలు - పేరు మార్చిన కేంద్ర విద్యాశాఖ - విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం

చొప్పదండి, సెప్టెంబరు 21: ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో అత్యుత్తమ విద్యను అందిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయాల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జవహర్ నవోదయ విద్యాలయాలు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) స్కూల్స్‌గా మారాయి. కేంద్ర విద్యాశాఖ ఈ మేరకు మార్పు చేసింది. తమిళనాడు మినహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని 661 నవోదయ విద్యాలయాలు పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయాలుగా మార్పు చేశారు. ప్రస్తుతం ప్రతీవిద్యార్థికి ఇస్తున్న లక్ష రూపాయల బడ్జెట్‌కు అదనంగా మరో 20 వేల రూపాయలను పెంచనున్నట్లు సమాచారం. నవోదయ విద్యాలయాలు ఏర్పడిన 38 ఏళ్ల తరువాత పేరు మారడం విశేషం. కాగా నవోదయ విద్యాలయంలో ప్రస్తుతం ప్రతీ విద్యార్థిపై కేంద్ర ప్రభుత్వం ఏడాదికి లక్ష రూపాయలను ఖర్చు పెడుతోంది. పీఎం శ్రీ స్కూల్స్‌లో దీనికి తోడుగా మరో 20 వేల రూపాయల బడ్జెట్‌ను పెంచుతున్నట్లు సమాచారం. అదనపు నిధులతో విద్యార్థుల కోసం సైన్స్, సోషల్, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఫిజిక్స్ , కెమిస్ట్రీ ల్యాబ్ లను ప్రతీ విద్యాలయంలో ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ ల్యాబ్‌లు ఎంతో దోహద పడుతాయి.

● **గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం..**

దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ 1985లో అప్పటి అస్సాం రాష్ట్రంలోని మారుమూల గ్రామం లో పర్యటించే సమయంలో చదువు లేని చిన్నా రులను గమనించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థు లకు విద్యను అందించేందుకు ఏదైనా చేయాలనే సంకల్పంతో ఢిల్లీకి తిరిగి వచ్చిన వెంటనే అప్పటి మానవవనరులశాఖ మంత్రి పీవీని పిలిచి చర్చించారు. దీంతో పీవీ నవోదయ విద్యాలయాలకు నాంది పలికారు. రాజీవ్‌గాంధీ సుముఖత వ్యక్తం చేయడంతో 1986లో పైలట్ ప్రాజెక్టుగా దేశంలో రెండు నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లోని కరీంనగర్ జిల్లా చొప్పదండిలో నవోదయ విద్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం పేరు మార్పుతో అదనపు బడ్జెట్ సమకూరనుంది. దీంతో అభివృద్ధి దిశలో పయనించేందుకు నవోదయ విద్యాలయాలు ముస్తాబవుతున్నాయి. విద్యాలయంలో 80 సీట్లకు గాను 75 శాతం మేరకు 60 సీట్లను గ్రామీణ విద్యార్థులకు కేటాయిస్తారు. మిగిలిన 20 సీట్లను పట్టణ ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీలకు, 7.5 శాతం ఎస్టీలకు, మూడు శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయిస్తారు. మొత్తం సీట్లలో మూడింట ఒక వంతు సీట్లను బాలికలకు రిజర్వ్ చేస్తారు. సీబీఎస్ఈ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించి మార్కులు, మెరిట్ కేటగిరి ఆధారంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

- వేములవాడ ప్రైవేట్ అద్దె గదిలో పురుగుల మందు తాగిన రేగొండ వాసి


కరుణాకర్‌రెడ్డి(ఫైల్).

వేములవాడ, సెప్టెంబరు 21: వేములవాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ అద్దె గదిలో పొన్నాల కరుణాకర్‌రెడ్డి (38) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి చెందిన పొన్నాల కరుణాకర్‌రెడ్డి గత మంగళవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. శనివారం వేములవాడ జాత్రా గ్రౌండ్‌లోని ఓ ప్రైవేటు అద్దె గదిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అతడిని చికిత్స కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పౌల్ట్రీ వ్యాపారం చేసే కరుణాకర్ రెడ్డికి కరోనాకాలం నుంచి తీవ్ర నష్టాలు రావడంతో మూడు కోట్ల వరకు అప్పులైనట్టు బంధువుల ద్వారా తెలిసింది. కరుణాకర్‌రెడ్డి ఏప్రిల్‌లోనూ ఇంటి నుంచి వెళ్లిపోయి నెలరోజుల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. మళ్లీ అప్పుల బాధలు తీవ్రమవడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, బంధువులు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమేష్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జి కృష్ణ

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 21: మండలంలోరి కొత్తపల్లి గ్రామంలో గత గురువారం జరిగిన హత్యకు సంబంధించిన నేరస్తుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఏసీపీ గజ్జి కృష్ణ వెల్లడించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన రిటైర్డు సింగరేణి ఉద్యోగి కలవేన లక్ష్మయ్య తన భార్య ఇద్దరు కొడుకులతో మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌లో నివాసముంటున్నాడు. అతనికి ఇద్దరు తమ్ముళ్లు కలవేన రాజయ్య, మల్లయ్యలు గ్రామంలోనే తమకున్న భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి దగ్గరి బంధువైన కలవేన రాజేశం(68) రిటైర్డు రైల్వే ఉద్యోగి భూముల వీరి పక్కపక్కనే ఉన్నాయి. ఇక్కడే ఉంటూ సాగు చేసుకుంటున్నాడు. పదిహేనేళ్లుగా వీరి మధ్య భూతగాదాలున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయతీలు నిర్వహించగా, కోర్టులోనూ కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. కలవేన లక్ష్మయ్య, ఇద్దరు తమ్ముళ్లు రాజయ్య, మల్లయ్యలు ఈ క్రమంలో కలవేన రాజేశంపై కక్ష పెంచుకున్నారు. తరచూ జరిగే ఈ భూవివాదం, కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి రాజేశంను కడతేర్చేందుకు పథకం వేశారు.

ఈనెల 19న రాజేశం తన భూమిని కొలిపిస్తున్నాడన్న సమాచారం తెలుసుకున్నారు. అదును చూసి హత్య చేసేందుకు ముగ్గురు అన్నదమ్ములు సిద్ధమయ్యారు. తన భూమి వద్ద పని చేసుకొని రాజేశం ఇంటికి తిరిగి వచ్చేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ముగ్గురన్నదమ్ములు మాటు వేసి ఉన్నారు. రాజేశంతో కొంత సమయం పాటు కేసులు విరమించుకోవాలని వాగ్వాదానికి దిగారు. మరోవైపు రాజేశం తలపై లక్ష్మయ్య కర్రతో బలంగా బాదాడు. అలాగే పలుమార్లు బాదడంతో రాజేశం అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు అక్కడినుంచి పారిపోయారు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మణ్ కేసు నమోదు చేసుకోగా, సీఐ ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నేరస్థుడు లక్ష్మయ్య గ్రామంలోనే ఉన్నాడన్న సమాచారంతో అదుపులోకి తీసుకుని విచారించగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిపాడు. మల్లయ్య, రాజయ్యలు పరారీలో ఉన్నారని, హత్యకు ఉపయోగించిన కర్ర, మోటార్‌సైకిల్, రక్తపు దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. త్వరలో పరారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుంటామన్నారు.

బెదిరింపులు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

- ఇప్పటికే రామగిరిలో-1, మంథనిలో-3 కేసులు

మంథని, సెప్టెంబరు 21: బెదరింపులు, అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్న మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ అలియాస్ సతీష్‌ను త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని మంథని సీఐ రాజు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంథని పోలీసుస్టేషన్‌లో శనివారం తాజాగా ఫిర్యాదు రావడంతో ఇనుములపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు బెదిరింపులు, అక్రమ వసూళ్లకు సంబంధించి మంథని పోలీసు సేషన్‌లో మూడు, రామగిరి పోలీసుసేషన్‌లో ఇనుముల సతీష్‌పై ఒక కేసు నమోదైనట్లు తెలిపారు. పలు కేసుల్లో ఇనుముల సత్యనారాయణకు సహకరించిన రావికంటి సతీష్‌ను ఇప్పటికే అరెస్టు చేసి జైలు పంపించామన్నారు. స్థానిక కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బెల్లంకొండ రవీందర్‌రెడ్డిని రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ బెదిరించగా అతను సత్యనారాయణకు లక్ష రూపాయలు ఇచ్చాడన్నారు. మరో లక్ష రూపాయలు కూడా ఇవ్వాలని లేకపోతే ఆస్తి, ప్రాణనష్టం కలిగిస్తానని సత్యనారాయణ పలుసార్లు బెదిరించినట్లు తెలిపారు. గతంలో బాధితుడు భయపడి ఫిర్యాదు చేయలేదని, ఇప్పుడు ఫిర్యాదు చేయడంతో సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంథని ప్రాంతంలో ఇంకా ఇనుముల సత్యనారాయణ బాధితులు ఉంటే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గణపతి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 21: మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన కేసులో ఇద్దరు వ్యక్తులకు నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి కరుణాకర్ శనివారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లాలోని కోడిమ్యాల మండలం పూడూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ నాగభూషణం, మెట్‌పెల్లికి చెందిన గుండేటి మధుసూదన్ అనే ఇద్దరు అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై రామచంద్రంకు పట్టుబడ్డారు. ట్రాఫిక్ ఎస్సై కేసు నమోదు చేసి ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు.

సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి


మృతిచెందిన బానోతు లక్ష్మి

వీర్నపల్లి, సెప్టెంబర్ 21: ఉపాధిహామీ పథకం సమాచారాన్ని తెలిపేందుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మె కూలి గిరిజన మహిళ మృతి చెందిన ఘటన వీర్నపల్లి మండలం సీతారాం నాయక్ తండా గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు లక్ష్మి (58) తమకున్న పశువులతో మేతను మేపేందుకు అడవిలోకి వెళ్లింది. మధ్యాహ్న సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో సిమెంట్ దిమ్మె పక్కన సేదతీరేందుకు కూర్చుంది. అదే సమయంలో గేదెలు పోట్లాడుకుంటూ దిమ్మెకు తగలడంతో ఒక్కసారిగా ఆమెపై విరిగిపడింది. సిమెంట్ ఇటుకలు ఆమెకు బలంగా తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం అటునుంచి పశువులను తీసుకెళ్తున్న గిరిజనులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలికి భర్త రావుజి, కుమారులు సంతోష్, రమేష్ ఉన్నారు. పోలీసులు సంఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, సెప్టెంబరు 21: ధర్మపురిలో భాద్రపద మాసం శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామివారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

● **సంకటహార చతుర్థి పూజలు..**

రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహార చతుర్థి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. గణపతి ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

● **యమ ధర్మరాజు ఆలయంలో అభిషేకం..**

యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ఆయుష్యసూక్తం, యమసూక్త పూర్వక అభిషేకం నిర్వహించారు.

● **కొండగట్టు అంజన్న సన్నిధిలో..**

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడు, రాములవారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

'మిడ్ మానేరు' పనులపై విజిలెన్స్ విచారణ

- ఎల్ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1లో రికార్డులు స్వాధీనం


రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబరు 21: మిడ్ మానేరు రిజర్వాయర్ పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. దీనిలో భాగంగా శనివారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ సర్కిల్-1, కాళేశ్వరం సర్కిల్-1 కరీంనగర్ కార్యాలయానికి నలుగురు విజిలెన్స్ అధికారుల బృందం ఉదయం వచ్చి సాయంత్రం వరకు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్(డీఎస్ఈ) అస్మత్ అలిని కలిసిన విజిలెన్స్ అధికారులు మిడ్ మానేరు ప్రాజెక్టు పనులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించాలని కోరారు. కాళేశ్వరం సర్కిల్-1 కార్యాలయంలో డీఎస్ఈ వెంకటయ్యను కలిసిన విజిలెన్స్ అధికారులు కాళేశ్వరం పరిధిలోని లింకు-3, ప్యాకేజీ-9 పరిధిలోని మల్కంపేట్ రిజర్వాయర్‌కు సంబంధించిన ఫైళ్లు అడిగి తీసుకొని పరిశీలించినట్లు సమాచారం. మిడ్‌మానేరు రిజర్వాయర్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు దానికి సంబంధించిన ఫైళ్లు తీసుకున్నట్లు సమాచారం. ఆయా ప్రాజెక్టు అంచనాలు కాలపరిమితి, పొడిగించిన కాలపరిమితి వివరాలు, టెండర్ ప్రక్రియ, బిల్లుల రికార్డులు, చెల్లింపులు, కాంట్రాక్టర్లు, అధికారుల వివరాలను విజిలెన్స్ అధికారులు కోరారు. ఆయా ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటినుంచి ఇప్పటివరకు విధులు నిర్వహించిన ఇంజనీర్ల పూర్తి సమాచారం అడిగి తీసుకుంటున్నట్లు తెలిసింది. కార్యాలయంలోనే ఫైళ్లు, అగ్రిమెంట్లు ఇతర డాక్యుమెంట్లు పరిశీలించిన విజిలెన్స్ అధికారులు అనుమానం ఉన్న ఫైల్స్‌ను వెంట తీసుకువెళ్లినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఏఈ శశిధర్, శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

జ్యోతినగర్, సెప్టెంబరు 21: రామగుండం ఎన్‌టీపీసీలో ఉమ్మడి జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎన్‌టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల ద్వారా శారీరక, మానసిక దారుఢ్యం పెరుగుతుందని అన్నారు. పాఠశాల దశ నుంచి ఏదైనా ఒక క్రీడల్లో ప్రావీణ్యం పొందేలా సాధన చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన 100 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ సీజీఎం సింగరాయ, అధికారులు, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


స్కేటింగ్ చేస్తున్న చిన్నారులు

రేపు అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయ నెట్స్‌లో ఉదయం 8 గంటలనుంచి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. 2005 సెప్టెంబరు1 తరువాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు క్రికెట్ యూనిఫామ్, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు.

పోత్గల్ శివారులో చిరుత కలకలం

ముస్తాబాద్, సెప్టెంబరు 21: మండలంలోని పోత్గల్ శివారులో చిరుత కనిపించిందని జోరుగా ప్రచారం జరగడంతో ముస్తాబాద్, పోత్గల్ గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు శనివారం భయాందోళనకు గురయ్యారు. పోత్గల్ దారిలోని రైస్‌మిల్ పక్కన మానేరు కెనాల్ నుంచి పోత్గల్ రామాలయం వైపు వెళ్తుండగా ఒర్రె వద్ద ఒక చిరుత, రెండు పిల్లలను చూసినట్లు ఓ రైతు చెప్పడంతో కలకలం నెలకొంది. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గణేశ్ గ్రామస్థులతో వచ్చి పులి అడుగులను పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. పులి అడుగులు పెద్దగా ఉంటాయని అయినా రెండు రోజులు జాగ్రత్తగా ఉండాలని బీట్ ఆఫీసర్ రమేశ్ పేర్కొన్నారు.


పరిశీలిస్తున్న ఎస్సై గణేశ్, తదితరులు

అథ్లెటిక్స్‌లో చాంపియన్‌షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా జట్టు


ట్రోఫీతో అథ్లెటిక్స్ క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌ను జిల్లా క్రీడాకారులు సాధించారు. హైదరాబాద్‌లో ఈనెల 19,20 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు.

ఈ పోటీల్లో ఎం వినయ్ మూడు వేల మీటర్ల పరుగులో బంగారు, మూడువేల మీటర్ల ట్రిపుల్ చేస్‌లో కాంస్య పతకం సాధించారు. విష్ణువర్దన్ 10వేల మీటర్ల రేస్‌వాక్‌లో బంగారు పతకం, స్వామి జావలిన్‌త్రో, డిస్కస్‌త్రోలలో బంగారు పతకాలు, సంతోష్, 5వేల మీటర్ల పరుగులో బంగారు పతకం, విక్రమ్‌కుమార్ షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించి రాష్ట్ర చాంపియన్లుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కోచ్ తిరుపతి, వరుణ్‌లతో పాటు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ క్రీడాకారులను అభినందించారు.

అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా పొన్నం రవిచంద్ర



కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21: స్పెయిన్ దేశంలోని బార్సిలోనా పట్టణంలో జరగనున్న 31వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు, ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ అసిస్టెంట్ జెనరల్ సెక్రెటరీ డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. ఈ ఏడాది నవంబరు 14 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న ఈ చిత్రోత్సవానికి స్పెయిన్ నుంచి లొర్దేశ్ ఫెక్సియా, నార్వే నుంచి విలియం సవేరేసెన్, ఇండియా నుంచి పొన్నం రవిచంద్రలను జ్యూరీ సభ్యులుగా నియమిస్తూ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా సదరన్ రీజియన్ కార్యదర్శి బీఎస్ఎస్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రవిచంద్ర గతంలో నంది సినిమా అవార్డుల జ్యూరీ సభ్యునిగా, పోర్చుగల్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా పని చేశారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- పాల్గొన్న 19 బాలికల, బాలుర జట్లు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 21: తెలంగాణ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభం అయ్యాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లాల నుండి 19 బాలికలు జట్లు, 19 బాలుర జట్లు వచ్చాయి. శనివారం నుండి సోమవారం వరకు మూడు రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మొట్ట మొదటి సారిగా జరుగుతున్న సాఫ్ట్ బాల్ పోటీలను తిలకించడానికి స్థానిక ప్రజలు ఆశక్తి చూపుతూ క్రీడా మైదానం వస్తున్నారు. మొదటి రోజు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలను నిర్వాహకులు ఎలాంటి అట్టహాసం లేకుండా, ముఖ్య అతిథులు ఎవరిని ఆహ్వానించకుండా సాదాసీదాగా ప్రారంభించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జట్ల కోచ్‌లు, మేనేజర్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


సాఫ్ట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

విద్యార్థినిని వేధించిన ఉపాధ్యాయుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 21: కరీంనగర్ బోయవాడలోని గల ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిని వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను శనివారం అరెస్టు చేశామని కరీంనగర్ ఒకటో టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ అసభ్య కరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌పై శుక్రవారం రాత్రి పోక్సో కేసు నమోదు చేశామని, శనివారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలతో జైలుకు తరలిచామని సీఐ తెలిపారు.

బల్దియాలో ఇద్దరికి కారుణ్య నియామకాలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21: నగరపాలక సంస్థలో ఇద్దరికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామక పత్రాలను మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్ భాజ్‌పాయి అందజేశారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉప్పలేటి కొమురమ్మ, సంపత్‌శ్యాంకుమార్‌లకు నియామక ఉత్తర్వులను అందజేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

'రాంనగర్ బన్నీ' సినిమా యూనిట్ సందడి



నటీనటులను సన్మానిస్తున్న ఎస్‌వీజేసీ కళాశాల డైరెక్టర్లు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 21: అక్టోబర్ 4న విడుదల కాబోతున్న 'రాంనగర్ బన్నీ' సినిమా యూనిట్ శనివారం వావిలాలపల్లిలోని శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల (బాలికలు) క్యాంపస్‌లో సందడి చేసింది. సినిమా హీరో చంద్రహాస్ (బన్నీ), హీరోయిన్స్ విస్మయశ్రీ, రిచా జోషి, దర్శకుడు శ్రీనివాస్ మహత్, నిర్మాత మలయజ ప్రభాకర్, చీఫ్ కో ఆర్డినేటర్ నలుమాచు చంద్రశేఖర్ విద్యార్థులతో ముచ్చటించారు. హీరో బన్నీ ప్రముఖ నటుడు ప్రభాకర్ కొడుకు కావడం గమనార్హం. హీరో బన్నీ మాట్లాడుతూ కళాశాలలో ప్రథమ ద్వితీయ తృతీయ ర్యాంకులను సాధించిన విద్యార్థులకు 25000, 15000, 10000 చొప్పున పారితోషకాలు అందజేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీజేసీ విద్యాసంస్థల డైరెక్టర్లు వుట్కూరి మహిపాల్‌రెడ్డి, కాంతాల రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వేంకట వరప్రసాద్, వంగల సంతోష్‌రెడ్డితో పాటు నలుమాచు రాణి, చంద్రశేఖర్, రజిత, కృష్ణమూర్తి, కరుణ, పద్మ, శైలజ, పద్మారెడ్డి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు21: కరీంనగర్ మండలంలో చెర్లబూత్కూర్, గుంటూరుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సీడీపీఓ సబిత తనిఖీ చేశారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా ఎంపికైన చెర్లబూత్కూర్ కేంద్రంలో చేపట్టిన కలరింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరుపల్లి అంగన్ వాడీ కేంద్రంను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ నిర్మల, ప్రధానోపాధ్యాయురాలు భారతి, అంగన్‌వాడీ టీచర్‌లు పద్మ, రజియా పాల్గొన్నారు.

'చింతకుంట విలీన ప్రతిపాదనను విరమించుకోవాలి'

భగత్‌నగర్, సెప్టెంబరు 21: కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామాన్ని నగర పాలక సంస్థలో విలీనం చేసే ఆలోచనను విరమించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ తిరుపతినాయక్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మంత్రి విలీనం చేయాలని ప్రభుత్వానికి పంపిన సిఫారసులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21: నగరంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ తెలిపారు. ఉజ్వలపార్క్, ఆల్కాపురి, ఎన్టీఆర్ స్టాట్యూ కోతిరాంపూర్, గణేష్‌నగర్, హనుమాన్‌నగర్, దోబీవాడ, కట్టరాంపూర్ ఏరియా, తిరుమలనగర్, వినాయకనగర్, శ్రీనివాసనగర్, గౌతమినగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. టవర్ సర్కిల్, డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, గాంధీరోడ్, గర్ల్స్ జూనియర్ కాలేజ్ రోడ్, అహ్మద్‌పురా, రూరల్ పోలీస్ స్ట్రీట్ ఏరియా, బోయవాడ, గంజ్, టవర్‌సర్కిల్, సిఖ్‌వాడి, కమనారియా, ఆఫీస్ రోడ్, లక్ష్మీనగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డ్ రోడ్డు, సాయికృష్ణ థియేటర్ ఏరియా, గీత భవన్ నుండి మున్సిపల్ ఆఫీస్ వరకు, పోలీస్ హెడ్ క్వాటర్స్ ఏరియా, గీతా భవన్ చౌరస్తా, ఐబి చౌరస్తా, ఏడు కొండల ప్రాంతం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 21: సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని నగర ఏసీపీ గోపతి నరేందర్ అన్నారు. సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శనివారం టౌన్ ఏసీపీ నరేందర్, సీఐలు బిల్లా కోటేశ్వర్, విజయ్‌కుమార్, శ్రీలత, ఎస్ఐ చంద్రశేఖర్‌లను సన్మానించారు. పోలీసులు సూచనలు పాటిస్తూ మిలాద్ ఉన్ నబీ జల్సా నిర్వహించిన సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రినీ, ఏసీపీ నరేందర్ శాలువాతో సన్మానించారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 21: యువత వ్యసనాల బారిన పడొద్దని సాహితి ఫౌండేషన్ సభ్యులు సూచించారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం డ్రగ్స్ నియంత్రణ, వాటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాహితి ఫౌండేషన్ చైర్మన్ రాముల కుమార్, డాక్టర్ ఆస్పియా కుల్సం, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ మహ మ్మద్ అంకూస్, కిట్స్ కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొలిపాక రమేష్, డైరెక్టర్ కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

హుజూరాబాద్, సెప్టెంబరు 21: హుజూరాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం అధికారులు గైర్హాజర్ కావడంతో కౌన్సిలర్లు బహిష్కరించారు. అధికారులు రాకపోవడంతో సమావేశాన్ని బహిష్కరించినట్లు కౌన్సిలర్లు తెలిపారు. అందరూ అధికారులు హాజరయ్యేలా చూడాలని కమిషనర్ సమ్మయ్యను కౌన్సిలర్లు కోరారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 21: జమ్మికుంట పట్టణంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్‌రెడ్డికి మద్దతుగా వీఎన్ఆర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓటరు నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రత్నాకర్, రాజు, రఫీ, నాగరాజు, సమ్మయ్య, సాయి బతదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్, కల్వల, రాజాపూర్ గ్రామాల్లో శనివారం అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డికి మద్దతుగా వీఎన్ఆర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మారముల్ల శ్రీనివాస్, కనుకుంట్ల హరికృష్ణ, రెడ్డి రమేష్, దాసరపు మహేందర్, సిరిపెల్లి ప్రశాంత్, ముద్దం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

- మున్సిపల్ కార్యాలయం మేనేజర్‌కు కార్మికుల వినతి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

జమ్మికుంట, సెప్టెంబరు 21: జమ్మికుంట మున్సిపల్ కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మేనేజర్ రాజిరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనగం రాజమల్లు, దొడ్డె రత్నాకర్, జక్కె కరుణాకర్, సదాశివరెడ్డి, దూడపాక స్వామి, శశికుమార్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 21:నగరంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఎన్టీఆర్ బైపాస్ రోడ్డులోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిరంకుశ నిజాం వ్యతిరేక తెలంగాణ ఉద్యమ నాయకుల్లో కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రముఖ నాయకులని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు మెతుకు సత్యం పాల్గొన్నారు.

●తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలిన త్యాగధనుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ అని పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పోలు సత్యనారాయణ కొనియాడారు. నగరంలోని బాపూజీ విగ్రహానికి వారు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు పద్మశాలి సంఘం, పోపా ప్రతినిధులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ అర్బన్:** వెనుకబడిన తరగతులు, తాడిత పీడిత వర్గాల ఆత్మ గౌరవానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రతీక అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఇటీవల హైండ్లూమ్ టెక్నాలజీ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈనెల 27న జరగనున్న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు సీఎస్ శాంతికుమారికి ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

● తెలంగాణ ఉద్యమం కోసం తన పదవిని తృణప్రాయంగా వదులుకున్న గొప్ప ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి అంజనేయులుగౌడ్‌లు అన్నారు. శనివారం నగరంలోని అల్గునూరు బైపాస్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల సుజిత్ కుమార్, పడిశెట్టి భూమయ్య, గుండా మల్లేష్, వరహాల చారి, పోతుగంటి శ్రీనివాస్, జడల రమేష్ , వంగలవిద్యాసాగర్, నాగుల సతీష్, బొబ్బిలి విక్టర్, మెతుకు సత్యం, రామిడి రాజిరెడ్డి ,నూనె గోపాల్ రెడ్డి, బత్తిని చంద్రయ్యగౌడ్, గంగుల దిలీప్, కుంభాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని కొత్తపల్లి పట్టణంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

●తెలంగాణ ఉద్యమ కెరటం కొండా లక్ష్మణ్ బాపూజీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసాల రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కళ్లెం వాసు దేవరెడ్డి, దండు కొమురయ్య, ఎడమ సత్యనారాయణరెడ్డి, వంగల పవన్, ప్రవీణ్, అసెంబ్లీకన్వీనర్ దుబాల శ్రీనివాస్, మాసం గణేష్, కైలాస నవీన్, రాజు, సంతోష్, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, వరాల జ్యోతి పాల్గొన్నారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జీ ఇంగిలే రామారావు, ఎండీ సలీం, రమేశ్, మల్లేష్, అశోక్, మహేందర్, సమ్మయ్య రాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిపై ముగిసిన శిక్షణ

గణేశ్‌నగర్, సెప్టెంబరు21: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలేడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ సలీం తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాభివృద్ధిని సాధిస్తేనే విజయాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. టాస్క్ ట్రైనర్ ఆంటోనీ డిసౌజ మాట్లాడుతూ నైపుణ్యాలతో మెరుగుపరుచు కున్నట్లయితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు.

నేడు హాఫ్ మారథాన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 21: కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించనున్న కరీంనగర్ హాఫ్ మారథాన్ ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మారథాన్ కమిటీ చైర్మన్ పసుల మహేశ్ చర్చించారు. అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న రన్నర్స్ అందరికీ టీషర్ట్‌ను, బిబ్‌నెంబర్లను అందించారు. వీరంతా ఉదయం 5గంటలకు తప్పనిసరిగా అంబేద్కర్ స్టేడియంలో హాజరుకావాలని తెలిపారు. మారథాన్‌లో పాల్గొంటున్న రన్నర్లకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ఆంక్షలను విధించడం జరిగిందని తెలిపారు.

కమ్యూనిస్టు విగ్రహాల ఐలాండ్‌లను సుందరీకరణ చేయాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 21: నగరంలోని అనభేరి ప్రభాకర్ రావు, బద్దం ఎల్లారెడ్డి విగ్రహాల వద్ద మరమ్మతులు చేపట్టి సుందరీకరణ చేపట్టాలని మేయర్ సునీల్‌రావుకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ వెంకటేశ్వర ఆలయం ముందు ఉన్న అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహాన్ని మాజీ సీఎం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ప్రారంభించగా, కోతిరాంపూర్‌లోని బద్దం ఎల్లారెడ్డి విగ్రహాన్ని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారన్నారు. మేయర్ సానుకూలంగా స్పందించి పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు పాల్గొన్నారు.

నేడు గంగాధరలో అర్బన్ బ్యాంకు బ్రాంచి ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అర్బన్ బ్యాంకు మధురనగర్ బ్రాంచి

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 21: ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు లిమిటెడ్ ఆదివారం గంగాధర ఎక్స్‌రోడ్‌లోని మధురనగర్‌లో నూతన బ్రాంచిని ప్రారంభిస్తోంది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి బ్యాంకు శాఖను ప్రారంభిస్తారని బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, సీఈవో నునుగొండ శ్రీనివాస్ తెలిపారు. బ్యాంకు సేవలను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో ఆర్‌బీఐ అనుమతితో బ్యాంకు పాలకవర్గంలో చేసిన తీర్మానం మేరకు ఈ నూతనశాఖను ప్రారంభిస్తున్నామని చెప్పారు. కరీంనగర్ మెయిన్ బ్రాంచిగా ఉన్న అర్బన్ బ్యాంకుకు జగిత్యాలలో కూడా బ్రాంచి ఉందని తెలిపారు. ఈ కార్యక్ర మానికి అధికారులు, పాలకవర్గసభ్యులు, బ్యాంకు సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రైతుల సమస్యల పరిష్కారానికి 'పొలం బాట'

-టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21: రైతుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని చేపడుతున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఇందులో వంగిన పోల్‌లను, లూస్‌లైన్‌లను సరి చేస్తున్నామని, మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. తీగల మధ్య అవసరం ఉన్న చోట స్పేసర్స్ పెడుతున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు లేకుండా మెరుగైన సరఫరా అందించడానికి వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయని అన్నారు. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వ్యవసాయ దారులు వెంటనే 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆ ఫిర్యాదు సమాచారం వెంటనే వెబ్ అప్లికేషన్ ద్వారా సంబంధిత అధికారి మొబైల్ యాప్‌కి వెళ్తుందన్నారు. విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా రైతు సోదరులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం, వ్యవసాయ పంపు సెట్లను వినియోగించినప్పుడు కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్ విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కరెంటు మోటార్లను కాని, పైపులను కాని, ఫుట్ వాల్వులను కాని ఏమరపాటుతో తాకకూడదని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ సూచించారు.రైతులు, వినియోగదారులు విద్యుత్ శాఖకు తెలపకుండా స్వయంగా కరెంట్ పనులను చేసుకొని నిండుప్రాణాలు కోల్పోతున్నారని ఆయన అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- తహసీల్దార్‌కు తెలంగాణ ఉద్యమకారుల వినతి



హుజూరాబాద్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

హుజూరాబాద్, సెప్టెంబరు 21: సమస్యలు పరిష్కరించాలని శనివారం హుజూరా బాద్ తహసీల్దార్ కనకయ్యకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం వెంటనే అమలు చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, పెన్షన్ అమలు చేయాలని కోరారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో కనకం కుమారస్వామి, ఎక్కటి సంజీవరెడ్డి, శ్రీనుయాదవ్, సరోజన, ప్రభాకర్, మల్లాచారి, జువ్వాజి కుమార్, అన్నం ప్రవీణ్, దబ్బుట రాజు, మల్లేష్, దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం కేటాయించాలని ఫోరం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం అభినందనీయమని కొనియాడారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, పెన్షన్ అమలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎక్కటి సంజీవరెడ్డి, కనకం కుమారస్వామి, అరుకాల వీరేశలింగం, ఊకంటి మల్లాచారి, జువ్వాజి కుమార్, కొమ్ము ఆశోక్, అన్నం ప్రవీణ్, దబ్బుట రాజు, ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తిమ్మాపూర్, సెప్టెంబరు 21: మండలంలోని మలాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు జాతీయ సాహస కృత్యాల శిబిరానికి ఎంపికవడంతో శనివారం పలువురు అభినందించారు. హరియాణా రాష్ట్రంలో నేషనల్ యూత్ అడ్వెంచర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అక్టోబరు 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సాహస కృత్యాల శిబిరం నిర్వహించనున్నారు. ఈ శిబిరానికి ఎం భువన తేజ్(ఏడో తరగతి), కే శృతి, పి అన్విత, పి.రశ్మిత పి సాత్విక్(ఎనిమిదో తరగతి), ఎస్ రక్షిత, బి మధుప్రియ, బి శివగణేశ్, పి మహేష్, బి అభినయ్ (తొమ్మిదో తరగతి) ఎంపికయ్యారని తెలిపారు. శిక్షకుడు షరీఫ్ అహ్మద్ నేతృత్వంలో విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు పి ఉమారాణి తెలిపారు. కార్యక్రమంలో ఎం ఈవో మధుసూదనాచారి, ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, స్కౌట్ జిల్లా కార్య దర్శి కంకణాల రాంరెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, చక్రధర్, సయ్యద్ షఫీక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశం, లలిత పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ'పై పోటీలు

శంకరపట్నం, సెప్టెంబరు 21: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. భారత ప్రభుత్వం ఈ నెల 17నుంచి ప్రారంభించిన స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత నినాదంతో దేశ వ్యాప్తంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్ర మాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహిం చినట్లు ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. ఈ పోటీలలో విజే తలుగా నబా మహ్మద్, చందన, రిషిత, మణిసాయి, దీపక్, అక్షయనందన నిలిచారు. పాఠశాలలోని కల్చరల్ విభాగం ఉపాధ్యాయులు మహేందర్, ప్రభాకర్, రాజు, మధుకర్‌రావు, రమణారెడ్డి, కనకలక్ష్మి, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర, సెప్టెంబరు 21: జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నరేందర్‌రెడ్డి అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని అన్నారు. మండలంలోని కక్షిదారులు చిన్న చిన్న కేసులకు కోర్టుల వెంబడి తిరుగుతూ సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని అన్నారు. ఇరువర్గాలు పరస్పర అవగాహనతో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

గంగాధర, సెప్టెంబరు 21: విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గంగాధర మండల ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలను శనివారం మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. అండర్- 14,17 బాల బాలికలకు రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మ బహుమతులు అందజేశారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల విద్యార్థులతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ, మైనారిటీ గురుకుల, బీసీ బాలుర, బాలిక గురుకులాలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు రాగూర్, నరేష్ పాల్గొన్నారు.

శునకం విశ్వాసం

- యజమాని ఫొటో వద్ద నిరీక్షణ



సమ్మిరెడ్డి చిత్రపటం వద్ద ఆయన పెంచుకున్న శునకం

జమ్మికుంట, సెప్టెంబరు 21: తనను అల్లారు ముద్దుగా పెంచుకున్న యజమాని కనిపించక పోవడంతో ఆ శునకం నిత్యం యజమాని ఫొటో వద్దే ఉంటోంది. జమ్మికుంటకు చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఈ నెల 14న మృతి చెందాడు. సమ్మిరెడ్డికి శునకాలు అంటే ఎంతో ఇష్టం. ఎన్నో ఏళ్లుగా శునకాలను పెంచుకుంటున్నాడు. యజమాని కనిపించకపోవడంతో రెండు శునకాలు చిత్రపటం వద్దనే ఉంటున్నాయి. సమ్మిరెడ్డి కుటుంబీకులను పరామర్శించేందుకు వస్తున్న వారు వాటి విశ్వాసం చూసి అయ్యో పాపం అంటున్నారు. శునకాలు ఆహారం కూడా సరిగా తీసుకోవడం లేదని, ఎప్పుడూ ముభావంగా ఉంటున్నాయని అక్కడున్న వారు తెలిపారు.

కరాటేలో సెయింట్ జార్జ్ విద్యార్థి ప్రతిభ

భగత్‌నగర్, సెప్టెంబరు 21: సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సిబిఎస్ఈ)స్కూల్ విద్యార్థి ఎదుల్లకృషిత్ అండర్-14 విభాగం బాలుర కుమితేలో గోల్డ్‌మెడల్ సాధించాడు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14, 15 తేదీల్లో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ టు ఆల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. రేకుర్తి కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్ పెద్ద కుమారుడైన కృషిత్ నిరంతర కృషితో ఫైటింగ్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, కరాటే గురువు ఇంద్ర సురభి, గోజుర్యు కరాటే రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్‌సురభి వేణుగోపాల్‌ను అభినందించారు.

కంటి శస్త్ర చికిత్సలు

భగత్‌నగర్/కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 21: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి లయన్ ఎంజెఎఫ్ జోన్ చైర్ పర్సన్ చింతల కిషన్‌పటేల్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో ముగ్గురికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేకుర్తి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, ట్రస్ట్ మెంబర్ ఇంజనీర్ కోల అన్నారెడ్డిల సహకారంతో ఇప్పటి వరకు 134 ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ ర్యాకం లక్ష్మయ్య, ఆస్పత్రి టెక్నీషియన్ చింతల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానందలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 21: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో శనివారం అప్‌గ్రేడ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌కు 184 మంది హాజరుకాగా వీరికి రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారికి తదుపరి దశలో హైదరాబాద్‌లో మౌఖిక పరీక్షను నిర్వహించి, నియామక ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఎస్‌బ్యాంక్, ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్.మహమ్మద్ అబ్దుల్ సలీం పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 21: శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని కోరుతూ యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవి నర్సింహారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంద గణేష్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా విద్యాసంస్థలను నడిపిస్తున్నారన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

వీణవంక, సెప్టెంబరు 21: మండలంలోని ఘణ్ముకుల గ్రామంలోని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా, శనివారం విద్యార్థులు వారిని సన్మానించి వీడ్కోలు తెలిపారు. నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోయిజ్ బేగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థికి ప్రథమ బహుమతి

వీణవంక, సెప్టెంబరు 21: జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన గణిత, విజ్ఞాన మేళాలో వీణవంక మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన రాజోజుల ఆదిత్యచారి అనే విద్యార్థి ప్రథమ బహుమతి దక్కించుకున్నాడు. రెవిన్యూ డివిజన్ అధికారి ఎస్ శ్రీనివాస్ బహుమతి ప్రదానం చేశారు.

పరసరాల పరిశుభ్రత పాటించాలి

రామడుగు, సెప్టెంబరు 21: విద్యార్థులు పరసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రాజేశ్వరి, తహసీల్దార్ వెంకటలక్ష్మి అన్నారు. కస్తూర్బా పాఠశాలలో యూనిసెఫ్-స్వచ్ఛభారత్ బృందం సమన్వయంతో ఏర్పాటు చేసిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్‌స్వామి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో హిందీ దినోత్సవం

సైదాపూర్, సెప్టెంబరు 21: సైదాపూర్ మండలంలోని రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంద్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో హిందీ మాట్లాడించడం, హిందీ నాటక ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అనితారాణి పాఠశాలలో ల్యాబ్, లైబ్రరి ప్రారంభించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

భగత్‌నగర్, సెప్టెంబరు 21: నగరంలోని 17వ డివిజన్ 362 బూత్‌లో బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రతి బూత్ పరిధిలో 200 నుంచి 300 వరకు సభ్యత్వం చేయించాలని కమిటీలకు సూచించారు.

హుజూరాబాద్: పట్టణంలోని 37,61,62,63వ బూత్‌లలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, గంగిశెట్టి రాజు, యాళ్ల సంజీవరెడ్డి, కొంరయ్య, వీరయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

హుజూరాబాద్, సెప్టెంబరు 21: పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ఆల్ టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం 44వేల రూపాయల విరాళాన్ని జిల్లా అధ్యక్షుడు కొండాల్‌రావుకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో వెంకటచారి పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●కరీంనగర్ కల్చరల్: ఆలూరి కరుణమ్మ స్మారక జాతీయ పురస్కారానికి కరీంనగర్‌కు చెందిన రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మియాపురం శ్రీనివాస్ ఎంపికైనట్లు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఆలూరి విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు.

●భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్‌డే నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు నాగవేణి ఆధ్వర్యంలో హింది దివస్ నిర్వహించి విద్యార్థులు తయారు చేసిన మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

●కరీంనగర్ కల్చరల్: నగరంలోని ఫిలిం భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు కరీంనగర్ వ్యాఖ్యాన సోదరులుగా పేరొందిన మాడిశెట్టి గోపాల్, కెఎస్ అనంతాచార్యలపై వచ్చిన కవిత్వం 'మేము' కరీంనగర్ బ్రదర్స్ పుస్తకావిష్కరణ-అంకితోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

●సుభాష్‌నగర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలోని బ్లడ్‌బ్యాంక్‌లో రూ.11వేలకే ప్లేట్‌లెట్స్ అందిస్తు న్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి వుట్కూరి రాధాకృష్ణారెడ్డి తెలిపారు. ఫ్రెష్ ఫ్రోజోన్ ప్లాస్మా రూ.400లకే అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దాడి సంపత్, ఉపాధ్యక్షులుగా బండారు మహేందర్, ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, క్యాషియర్ ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.